నమస్తే తెలంగాణ
నిజామాబాద్, ఆదివారం 23 జూన్ 2024
SUNDAY, JUNE 23, 2024

## చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

### న్యాయ సేవా సదస్సులో జడ్జి భార్గవి



న్యాయ సేవా సదస్సులో మాట్లాడుతున్న జడ్జి

బాన్సువాడ రూరల్, జూన్ 22 : రాజ్యాంగం ప్రజలకు హక్కులు కల్పించిందని, తమ హక్కులకు భంగం కలిగితే కోర్టుల ద్వారా న్యాయం పొందాలని బాన్సువాడ కోర్టు జడ్జి భార్గవి సూచించారు. మండలంలోని తాడ్కోల్ గ్రామంలో మండల న్యాయసేవా అధికార కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదుస్సులో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమని తెలిపారు. ప్రజల హక్కులకు భంగం వాటిల్లితే కోర్టుల ద్వారా న్యాయం పొందాలని, ప్రజల తరఫున వాదించేందుకు కోర్టులో ప్రభుత్వ న్యాయవాది ఉంటాడని తెలిపారు. చిన్నచిన్న తగదాల కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఎంపీడీవో బషీరుద్దీన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, న్యాయవాదులు భూషన్ రెడ్డి, లక్ష్మీనారాయణమూర్తి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ బాలికల వసతి గృహం తనిఖీ



మైనార్టీ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్

కామారెడ్డి, జూన్ 22 : పట్టణంలోని మైనార్టీ బాలికల వసతి గృహాన్ని ఇన్‌చార్జి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్ శనివారం సందర్శించారు. వసతి గృహంలోని స్టోర్ రూంను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని, తరగతులకు సక్రమంగా హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థినులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రణీత, అధికారులు పాల్గొన్నారు.

# పనులు త్వరగా పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



ఆరెపల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మాచారెడ్డి, జూన్ 22 : మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్, పాల్వంచ మండలంలోని ఆరెపల్లి గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఆరెపల్లి గ్రామంలోని పాఠశాలలో వాటర్ ట్యాంక్ బిగించకపోవడంతో ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపీబాబు, ఏపీఎం శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**అమ్మ ఆదర్శ పాఠశాల పథకం పనులను పరిశీలన**

భిక్కనూరు, జూన్ 22 : భిక్కనూరు మండలం జంగంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న శానిటేషన్, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. పాఠశాలలో ఉన్న బోరు ఇంకిపోవడంతో తాగునీటి కోసం స్కూల్ దగ్గరిలో ఉన్న సింగిల్ ఫేస్ మోటరు నుంచి కనెక్షన్ తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సోహేల్, ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి ఆర్థికసాయం

రాజంపేట్, జూన్ 22 : మండల కేంద్రంలోని శ్రీశారద శిశు మందిర్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న పేద విద్యార్థిని కంచర్ల తేజశ్రీకి శ్రీరామ సేవా సమితి తరఫున పాఠశాల ఫీజును చెల్లించారు. కార్యక్రమంలో శ్రీ రామ సేవా సమితి సభ్యులు మొలుగు చంద్రమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పండరినాథ్, ఉపాధ్యాయులు ప్రభా కర్, సోని ప్రియ, సుష్మిత, స్వప్న, నవ్య, నిఖిత పాల్గొన్నారు.

## జాతీయ బంజారా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నునావత్ గణేశ్ నాయక్

కామారెడ్డి, జూన్ 22 : లంబాడ హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 1వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జాతీయ బంజారా సమ్మేళన సదస్సు నిర్వహిస్తున్నట్లు లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నునావత్ గణేశ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమ్మేళనం కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి లంబాడాలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాణాప్రతాప్ రాథోడ్, లంబాడ నాయకులు ఆనంద్‌రావు నాయక్, వినోద్ నాయక్, నునావత్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు బాగా చదువుకోవాలి

కామారెడ్డి,జూన్ 22 : విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థితిలోకి రావాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష అన్నారు. జిల్లా కేంద్రంలోని దళితవాడలో ఉన్న బాలసదన్‌ను ఆమె శనివారం సందర్శించారు. బాలికలతో మాట్లాడి సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. చదువు ఒక్కటే ఉన్నత స్థాయిలో నిలిపేదని అన్నారు. మంచిగా చదువుకుంటేనే దేశ భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతారని అన్నారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లను అందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ బావయ్య, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్రవంతి, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మోహన్‌రావు, పల్లె చిరంజీవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ స్టాఫ్ ఖాన్, సాయిప్రతీక్, సాయి కృష్ణ, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష

# యోగాతో మానసిక, శారీరక ప్రశాంతత

### జిల్లా అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి



యోగాసనాలు వేస్తున్న పోలీసులు



ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో యోగా చేస్తున్న పోలీసులు

కామారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్, జూన్ 22 : యోగాతో మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందని జిల్లా అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి అన్నారు. పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు కార్యాలయాల్లో శనివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసు మైదానంలో సిబ్బందితో కలిసి యోగా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. భారతదేశంలో పుట్టడం మన అందరి అదృష్టంగా భావించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజు యోగా, ప్రాణాయమం చేయాలని సూచించారు. యోగా చేయడంతో మానసిక ఆరోగ్యంతోపాటు ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. అనంతరం యోగా శిక్షకులు సంగీత, ప్రవీణ్, ఉమేశ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ యాకుబ్‌రెడ్డి, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రామన్, మురళి, రిజర్వ్ ఇన్‌స్పెక్టరులు శేఖర్, కృష్ణ, ఆర్ఎస్ఐలు, ఎస్సైలు, డీపీవో, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి**

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 22: యోగాను జీవితంలో ఒక భాగం చేసుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతుందని యోగాచార్యుడు నాగరాజ్‌గౌడ్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మహేశ్, సిబ్బందితో కలిసి శనివారం ఉదయం యోగాసనాలు వేశారు. విధుల్లో భాగంగా పోలీసు లు ప్రతిరోజూ విపరీతమైన అలసట, ఒత్తిడికి గురవుతారని అన్నారు. వారు నిత్యం ఉదయం గంట సేపు యోగాసనాలు వేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రతిఒక్కరూ తమ జీవనశైలిలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పిచ్చి మొక్కలు తొలగించండి సారూ..!



తహసీల్ కార్యాలయం వెనక భాగంలో పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలు

నాగిరెడ్డిపేట, జూన్ 22: నిత్యం ప్రజలతో సందడిగా ఉండే కార్యాలయం అది.. విధులు నిర్వహించడానికి పది మంది సిబ్బంది అందుబాటులో ఉంటారు. కానీ.. కార్యాలయం వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను మాత్రం తొలగించారు. ఇది ఎక్కడో కాదు.. నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయం వద్దనే.. ఆదర్శంగా ఉండాల్సిన తహసీల్ ఆఫీసు ఇలా ఉండడంపై ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కార్యాలయ గోడలపై చెట్లు పెరిగాయని, పిచ్చి మొక్కలు పెరగడంతో విష పురుగులు కార్యాలయంలోకి వస్తున్నాయని అంటున్నారు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## నీట్ పరీక్షను రద్దు చేయాలని సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి, జూన్ 22 : నీట్ పరీక్షను రద్దు చేయాలని, ఎన్‌టీఏని తొలగించాలని కోరుతూ విద్యార్థి సంఘ నాయకులు శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట్ పరీక్షలు నిర్వహించడానికి బీజేపీ ప్రభుత్వం ఎన్‌టీఏకు బాధ్యతలు అప్పగించగా వైఫల్యం చెందిందని అన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడడం సిగ్గుచేటని అన్నారు. పేపర్ లీకేజ్‌లో రూ.30 నుంచి రూ.40 లక్షలకు అమ్ముకున్నారని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు ఆజాద్, ఐరేని సందీప్, ముదాం అరుణ్, మణికంఠ, భరత్ సా యి, శ్యామ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య

బీబీపేట్, జూన్ 22 : మండల కేంద్రంలోని గాండ్ల కొప్పుల లాస్య అలియాస్ వీణ శనివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఎస్సై, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గాండ్ల లాస్య మానసిక పరిస్థితి సరిగా లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మండలంలోని జనగామ గ్రామంలో యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2015లో సిద్దిపేటకు చెందిన గాండ్ల శ్రావణ్‌కుమార్‌తో వివాహమైంది. కొంత కాలం క్రితం బాగానే ఉందని తర్వాత మానసిక పరిస్థితి సరిగా లేక ఇదివరకే పలు మార్లు ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిపారు. శుక్రవారం పాఠశాలకు వెళ్లి వచ్చిందని, తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో తండ్రికి మెలకువ వచ్చి చూడగా వీణ కనబడలేదన్నారు. ఇంటి పెరడులో ఉన్న గది లోపల నుంచి గడియ వేసి ఉండడంతో తలుపులు కొట్టగా కొద్ది సేపటికి వీణ తలుపు తీసింది. గదిలో పురుగుల మందు తాగి ప్రమాదకరస్థితిలో ఉండగా వెంటనే కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. మృతురాలు తండ్రి గాండ్ల రాంచంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

## మేమంతా ఎమ్మెల్యే వెంటే

బాన్సువాడ, జూన్ 22 : బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి కోసమే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారని, మేమంతా పోచారం వెంటే ఉంటామని బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, కాంగ్రెస్ పారీ కార్యకర్తలను, నాయకులకు కలుపుకొని ముందుకెళ్తామన్నారు.

### రహదారి కబ్జా

# అడ్డుకున్న యువకులు

### సర్వే చేయించుకోవాలని భూ యజమానికి సూచన

లింగంపేట, జూన్ 22: మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు కబ్జాను స్థానిక యువకులు శనివారం అడ్డుకున్నారు. మండల కేంద్రానికి చెందిన భూ యజమాని తన వ్యవసాయ పొలం పక్క నుంచి మత్తడి పోచమ్మ ఆలయానికి వెళ్లే దారిని తొలగించే ప్రయత్నం చేశాడు. భూమిని చదును చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక యువకులు అడ్డుకున్నారు. అమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారి కబ్జా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి బీటీ రోడ్డు వేయడానికి కృషి చేస్తుంటే, రహదారిని ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కబ్జాను అడ్డుకుని యథావిధిగా దారి నిర్మాణం చేపట్టారు. సంబంధిత యజమాని భూమి సర్వే చేయించుకొని హద్దులు ఏర్పాటు చేసుకోవాలని యువకులు సూచించారు.



లింగంపేటలోని మత్తడి పోచమ్మ ఆలయానికి వెళ్లే దారిని కబ్జా చేస్తుండగా అడ్డుకుంటున్న స్థానిక యువకులు

# డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

గాంధారి, జూన్ 22: 'రోడ్డుపై మురికి నీరు.. ఇబ్బంది పడుతున్న వాహనదారులు..' అనే కథనం ఈనెల 19న నమస్తే తెలంగాణ దిన పత్రికలో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి మురికి కాలువ నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని తిప్పారం రోడ్డుపై చాలా రోజులుగా మురికి నీరు ప్రవహిస్తుండడంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో అధికారులు రూ.మూడు లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అధికారులు కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. చాలా రోజులుగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించడంతో గ్రామస్తులతో పాటు రోడ్డు వెంట ప్రయాణించేవారు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.



డ్రైనేజీ నిర్మాణం కోసం గుంతలను తీస్తున్న పొక్లెయిన్

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, **NARSU SOLLA**, R/o. H.No.1-10/2, Bejjora, (M) Bheemgal, (D) Nizamabad. Changed my Surname/Name as **SULLA NARSUBAI** W/o.NADPI GANGARAM
**NTZ-324942**

**WANTED TEACHERS**

★Wanted Teachers to Teach Telugu, Hindi, English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant, Little Heart High School, Namdevwada, Nzb. Nursery to X Std. Contact No. 8309582476
**NTZ-324943**

**WANTED**

★**Corel Draw Photo Shop** Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
**NT-97639-AII**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ




పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సాహెల్

డోంగ్లీ, జూన్ 22: మండలంలోని పెద్ద టాక్లీ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయురాలు సాహెల్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకుడు గైక్వాడ్ విలాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్షీరాభిషేకం

ఎల్లారెడ్డి/ లింగంపేట/ నాగిరెడ్డిపేట/ రాజంపేట, జూన్ 22: రైతులు తీసుకున్న రూ.రెండు లక్షల్లోపు వ్యవసాయ రుణాన్ని మాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. దీంతో సీఎం కేసీఆర్‌తోపాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, రాజంపేట మండల కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీవో ప్రకాశ్

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 22: అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా చేపడుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీవో ప్రకాశ్ అన్నారు. మండలంలోని సఫ్దల్‌పూర్ గ్రామ పాఠశాలలో చేపడుతున్న మరమ్మతు పనులను ఆయన శనివారం పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమైనందున మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీలోని రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలోని నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యదర్శి అనిత ఉన్నారు.

## పోలీస్‌స్టేషన్ తనిఖీ

నాగిరెడ్డిపేట, జూన్ 22: నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌ను జిల్లా అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి శనివారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. నేరాలు, సిబ్బంది వివరాలను ఎస్సై రాజును అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్‌లో ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి